# పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

## ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు -మున్సిపల్ అధికారులతో సమీక్ష

## అధికారులు, వార్డు సచివాలయ ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేయాలి








**కందుకూరు పెన్ పవర్, డిసెంబర్ 24**

పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు మునిసిపల్ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వార్డు సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతూ బాధ్యతాయుతంగా పనిచేసి ప్రభుత్వానికి ప్రజల్లో మంచి పేరు తీసుకురావాలని సూచించారు. వార్డుల్లో మౌలిక వసతులైన నూతన రోడ్లు కాలువల కొరకు అంచనాలు తయారు చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రజలకు సురక్షితమైన త్రాగు నీరు అందించాలని, వీది దీపాల నిర్వహణ, ముఖ్యంగా పట్టణంలో పారిశుధ్య పనులను సకాలంలో పూర్తి చేయాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు తెలియజేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందజేయటంలో అలసత్వం వహించవద్దని, ప్రజల నుండి సచివాలయాలకు వచ్చే అర్జీలను త్వరతగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పట్టణంలో వాటర్ ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేయుటకు కొనుగోలు చేసిన నూతన ట్రాక్టర్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కొర్రపాటి అనూష, మున్సిపల్ డిఈ గణపతి, అన్ని విభాగాల అధిపతులు, సిబ్బంది వార్డు సచివాలయ ఉద్యోగులు, పాల్గొన్నారు.

## శాంతి, సంతోషాల పండుగ క్రిస్మన్

### ప్రజలందరూ సంతోషంగా పండుగ జరుపుకోవాలి

### నెల్లూరు పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్



**కందుకూరు పెన్ పవర్, డిసెంబర్ 24:**

ప్రజలందరూ ఏసుక్రీస్తు బోధనలు ఆచరిస్తూ సన్మార్ధంలో పయనించాలని. క్రిస్మన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని నెల్లూరు పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్ ఒక ప్రపటనలో పేర్కొన్నారు. క్రిస్మన్ పండుగ పర్వదినం సందర్భంగా కందుకూరు నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కష్టాల్లో ఉన్న పేదలకు సాయం అందించాలని, సాటివారి పట్ల ప్రేమ, దయ, కరుణ చూపాలన్నారు. క్రిస్మన్ ప్రపంచం మొత్తం జరుపుకునే పండుగ అన్నారు. అందరికీ ఏసుప్రభు ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించిన ఏసుప్రభు చూపిన మార్గంలో నడిస్తే ప్రశాంతమైన జీవనం గడపవచ్చునన్నారు. దుష్ట ఆలోచనలు విడనాడాలని, మనుషులందరూ ఒక్కటే అనే భావనతో ఉండాలన్నారు. అందరి పాపాలను ఏసుప్రభు శిలువపై మోశాడని తెలిపారు. క్రిస్మన్ పండుగ రోజు ప్రతి ఇల్లు వెలుగులతో నిండాలని, ప్రతి ఒక్కరూ ఆనందంగా గడపాలన్నారు. కూటమి ప్రభుత్వం క్రైస్తవ సోదరులకు అన్ని విధాల అండగా ఉంటుందని ఇంటూరి రాజేష్ తెలిపారు.

## క్రిస్మస్ శుభాకాంక్షలు


### కోటపాటి జనార్దన్ రావు

**బ్యూరో పెన్ పవర్, ప్రకాశం డిసెంబర్ 24**

జిల్లా ప్రజలందరికీ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటపాటి జనార్దన్ రావు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ,, సేవాతత్పరత, క్షమా గుణాన్ని బోధించిన ఏసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని కోటపాటి ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరు కూడా క్రీస్తు జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని నిజాయితీగా జీవించాలని, అందరం కలిసి మెలిసి ఐక్యత చాటుకుంటూ సమాజంలో స్ఫూర్తివంతమైన జీవితాన్ని గడపాలని సూచించారు. ప్రజలందరిపై ఏసుక్రీస్తు ఆశీస్సులు మెండుగా ఉండి ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కోటపాటి ఈ సందర్భంగా ఆకాంక్షించారు.



# శ్రీ సంస్కృతి స్కూల్‌లో క్రిస్మస్ వేడుకలు










**కందుకూరు పెన్ పవర్, డిసెంబర్ 24**

పట్టణంలోని గుర్రంవారి పాలెం లోని శ్రీ సంస్కృతి స్కూల్ లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలో అందంగా అలంకరించిన చెట్టును మెరిసే లైట్లు, విద్యార్థులు చేతితో తయారు చేసిన ఆభరణాలతో ముస్తాబు చేశారు. తరువాత విద్యార్థులు క్రీస్తు పుట్టుక గురించి సందేశాత్మక మైన నాటికను ప్రదర్శించారు. ముఖ్యంగా ప్రీ ప్రైమరీ పిల్లలు ప్రదర్శించిన నేటివిటీ ప్లే ఈ వేడుకల్లో హైలెట్ గా నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థులు మేరీ,యేసేబు, జ్ఞానులు,హేరోదు, దూతలు మొదలగు వేషధారణ లో సంగీతం , నృత్యం తో అలరించి , యేసు పుట్టిన రోజు ను పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. ముఖ్యంగా శాంటా క్లాజ్ ప్రత్యేకంగా దర్శనమిచ్చి చిన్నారులకు చాక్లెట్ లు పంచి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ కొంకా చంద్రశేఖర్ మాట్లాడుతూ మానవత్వానికి పునాది రాయిని ఏర్పరుచుకునే మతపరమైన సరిహద్దులను దాటి కరుణను పంచుకోవడం మరియు ప్రదర్శించడం ద్వారా మంచి విలువైన జీవితాన్ని గడపాలని రాబోయే సంవత్సరంలో విద్యార్థులు ఆనందం,మంచి ఆరోగ్యం, సంతృప్తితో ఉండాలని విద్యార్థులకు తల్లిదండ్రులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి. శివకుమార్, వైస్ ప్రిన్సిపాల్ శోభారాణి ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులుకు శుభాకాంక్షలు తెలిపారు.

## కందుకూరు సబ్ కలెక్టర్ హామీతో దీక్ష విరమించిన మూగజీవులు





**కందుకూరు పెన్ పవర్, డిసెంబర్ 24**

మండలంలోని జి. మేకపాడు గ్రామంలో సర్వే నంబరు269లో ఉన్న, 7.40ఎకరాల భూమిని స్వాధీనం చేయాలని కోరుతూ కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాల యం వద్ద మర్రిపూడి మండలం నరసరాజుపాలెం గ్రామ రైతులు ఆందోళన చేపట్టారు. మంగళవారం ఉదయం 9 గంటల నుండి రాత్రి ఏడు గంటల వరకు ఆందోళన కొనసాగించారు. ఈ ఆందోళనలో మూగ మహిళ, ఒక వికలాంగురాలు, ఒక చెమిటి వృద్ధురాలు, పాల్గొన్నారు అంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవాలి. ఉదయం నుండి వర్షం పడుతున్న తడుస్తూనే ఆందోళన చేపట్టడం విశేషం వీరికి వ్యతిరేకంగా కొండేపి నియోజకవర్గ టిడిపి నాయకత్వం ఉండటం వలన, అక్కడ రెవెన్యూ పోలీసు కూడా అధికార పార్టీ చెప్పు చేతల్లో ఉండడం వలన దీక్ష చేపట్టాల్సి వచ్చిందని, గుట్లపల్లి సురేష్, సత్యవతి తెలిపారు. ఈ దీక్షను కళ్ళారా చూసిన సబ్ కలెక్టర్ శ్రీ పూజ వారిని రాత్రి 7 గంటలకు పిలిచి, మీ సమస్య న్యాయమైంది, ఈ మూగజీవులతో రాత్రిపూట ఆందోళన చేయటం సరైనది కాదు, నేను మీకు శుక్రవారం లోపు సమస్య పరిష్కార చేస్తాను, శుక్రవారం రోజు పోలీస్ ఇన్స్పెక్టర్, మండల తాసిల్దార్ని పంపించి పరిష్కారం చేస్తాను, దీక్ష విరమించండి కోరారు. దీనితో ఆందోళనకారులు, సబ్ కలెక్టర్ శ్రీ పూజ ఇచ్చిన హామీ మేరకు ఆందోళన విరమించారు. శుక్రవారం కనుక మా సమస్య పరిష్కారం కాకపోతే, మరల ఆందోళన చేపడుతామని, సురేష్ సత్యవతి తెలిపారు. వీరితోపాటు, మూగజీవులైన ఎండ్లూరి ఆదిలక్ష్మి, కొండమ్మ, గుట్లపల్లి విజయమ్మ ఆందోళనలో పాల్గొన్నారు.

## క్రిస్మస్ శుభాకాంక్షలు

### ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్



**కందుకూరు పెన్ పవర్ డిసెంబర్ 24**

తూర్పు రాయలసీమ ప్రకాశం, నెల్లూరు,చిత్తూరు క్రైస్తవ సోదర సోదరీమణులకు కుప్పం నియోజకవర్గ సమన్వయకర్తల చైర్మన్, శాసన మండలి విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రైస్తవ సోదరులందరూ భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ పండగ జరుపుకోవాలని ఆయన కోరారు. క్రిస్మస్ అంటే ఏసు ప్రభువును ఆరాధించే రోజు. విశ్వవ్యాప్తంగా ప్రజలందరిలో ప్రేమ,సహనం, శాంతి, కరుణ కూడిన విశ్వాసపూరితమైన, ఏసుక్రీస్తు చూపిన మార్గం మనందరికీ అనుచరణీయం అని డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. క్రైస్తవ సోదర, సోదరీమణులు అందరూ కలిసి శాంతి, సామరస్యం కోసం ఏసు ప్రభువును భక్తిశ్రద్ధలతో ప్రార్థించాలని ఎమ్మెల్సీ డాక్టర్ శ్రీకాంత్ కోరారు.

## క్రైస్తవ సోదర, సోదరిమణులకు

## క్రిస్మస్ శుభాకాంక్షలు

### -మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం



**కందుకూరు పెన్ పవర్, డిసెంబర్ 24**

కందుకూరు నియోజకవర్గం పరిధిలోని క్రైస్తవ సోదర , సోదరీమణులకు క్రిస్మస్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని కందుకూరు నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ దివి శివరాం శుభాకాంక్షలు తెలియజేశారు. క్రైస్తవులు క్రిస్మస్ పండుగను ఏసుక్రీస్తు జన్మదినోత్సవంగా జరుపుకుంటారని యేసుక్రీస్తు అంటేనే ప్రేమ , కరుణ , దయ అనే మూడు సూక్తులకు ప్రతిరూపమని అటువంటి క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరు ఆచరించి మంచి మార్గంలో నడచుకోవాలని శివరాం సూచించారు. ప్రేమతో కూడిన జీవన మార్గాన్ని ప్రపంచానికి తెలియజేసిన మహోన్నతమైన వ్యక్తి ఏసుక్రీస్తు అని క్రైస్తవ సోదరులందరూ సుఖసంతోషాలతో క్రిస్మస్ పండుగను జరుపుకోవాలన్నారు.

## కొండపి నియోజకవర్గ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు

### ఏపీ మారి టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య

**బ్యూరో పెన్ పవర్, ప్రకాశం డిసెంబర్ 24:**

కొండపి నియోజక వర్గ క్రైస్తవ సోదర సోదరీమణులు ఆనందోత్సాహాలతో క్రిస్మస్ పండుగని జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ ఆంధ్రప్రదేశ్ మారి టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మంగళవారం ఒక ప్రకటనలో క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. "ఏసుక్రీస్తు" ప్రపంచ సర్వమత శాంతి స్థాపన కొరకు పుట్టిన మహనీయుడు, గొప్ప శాంతి దూత అని సత్య పేర్కొన్నారు. క్రిస్మస్ పండుగ శుభ సందర్భంగా అందరికీ శాంతి, సౌభాగ్యాలు చేకూరాలని దామచర్ల సత్య ఆకాంక్షించారు.



# సిపిఎం 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**కందుకూరు పెన్ పవర్, డిసెంబర్ 24**

ఫిబ్రవరి 1,2,3 తేదీలలో నెల్లూరు నగరంలో జరుగుతున్న సిపిఎం 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం ఉలవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జీవీబీ కుమార్ తెలిపారు. స్థానిక సుందరయ్య భవన్ లో ఎస్. డి గౌస్ బాషా అధ్యక్షతన ఉలవపాడు, వలేటివారిపాలెం మండలాల చెందిన నాయకులతో ప్రాంతీయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జీవీబీ కుమార్ మాట్లాడుతూ ప్రజలపై భారాల మోపే కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాల అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం నికరంగా సిపిఎం పోరాడుతుంది. ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తుంది. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేసే సిపిఎం రాష్ట్ర మహాసభల నిర్వహణకు, భవిష్యత్తులో జరిగే ప్రజా ఉద్యమాలకు ప్రజలంతా తోడ్పాటును అందించాలని కుమార్ కోరారు. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలపై అమిత్ షా జాతికి క్షమాపణ చెప్పాలని, బేషరతుగా రాజీనామా చేయాలని ఈనెల 30న జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.




వలేటివారిపాలెం మండలం పోకూరు దళితవాడ పక్కనే ఇటీవల ఏర్పాటు చేసిన మద్యం షాపును తక్షణమే తొలగించాలని, అందుకోసం మహిళలను సమీకరించి ఉద్యమం చేయాలని నిర్ణయించారు. ఉలవపాడు లో నందిని పొదుపు గ్రూపు పేరుతో గిరిజనుల నుండి 80 లక్షల మేర అక్రమంగా వసూళ్ళు చేసిన నందిని పొదుపు గ్రూపు నిర్వాకులపై చర్య తీసుకోవాలని, గిరిజనుల నుండి వసూలు చేసిన పొదుపు డబ్బులు గిరిజనులకు ఇప్పించేంతవరకు ఉద్యమించాలని నిర్ణయం చేశారు. సిపిఎం రాష్ట్ర మహాసభల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించాలని కమిటీ అభిప్రాయపడింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయాల్సిందిగా సిపిఎం శ్రేణులకు కుమార్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రాంతీయ కమిటీ సభ్యులు దువ్వూరి జాన్, సాదు చెన్నకేశవులు, దార్ల మాధవరావు, పొట్లూరు రవి, కత్తి సుజాత తదితరులు పాల్గొన్నారు.

